సాక్షి నల్లగొండ

శనివారం । 24 । మే । 2025



విరుల సాగుతో సిరులు

భువనగిరి మండలం కూనూరులో మహిళా రైతు రాజమణి పూలు సాగు చేస్తూ లాభాలు పొందుతోంది. - 10లో



అదుపుతప్పి కారు బోల్తా

కారు అదుపు తప్పి బోల్తా కొట్టడడంతో ఒకరు మృతి చెందగా.. ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. - 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37°/25°

మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు

నల్లగొండ : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం జిల్లాలోని 12 పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 2036 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 1851 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 282 మందికి 231 మంది విద్యార్థులు హాజరైనట్లు డీఐఈఓ దస్రూనాయక్ తెలిపారు.

వృత్యంతర శిక్షణతో ఆధునిక బోధన



మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

మిర్యాలగూడ : మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక బోధనా పద్ధతులు అమలు పర్చడానికి ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఉపయోగపడుతుందని డీఈఓ బొల్లారం భిక్షపతి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడలో.. దామరచర్ల, మిర్యాలగూడ, అడవిదేవులపల్లి మండలాలకు చెందిన ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. విద్యాశాఖ ఆదేశానుసారం పాఠశాల పునః ప్రారంభానికి ముందే ప్రతి ఉపాధ్యాయుడు ఐదు రోజులు శిక్షణ పొంది ఉండాలన్నారు. శిక్షణ అంశాలను ఉపాధ్యాయుల నుంచి అడిగి తెలుసుకొని సమాధానాలు రాబట్టారు. శిక్షణలో వసతులు, భోజన సౌకర్యాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులంతా మాతృభాష తెలుగులో దారాళంగా చదవడం, రాయడం వంటి నైపుణ్యాలను మెరుగుపరచాలని అన్నారు. జూన్ 6 నుంచి ఉపాధ్యాయులంతా బడిబాట కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓలు లావూరి బాలు, ఎం.బాలాజీనాయక్, ఆర్.వరలక్ష్మి ఉన్నారు.


విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి తెలిపారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సమతా సంక్షేమ సమితి, దళిత మోర్చాల ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినవారికి ఇవ్వనున్న పురస్కారాల పండుగ బ్రోచర్లను శుక్రవారం ఆయన నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, చింతా ముత్యాల్‌రావు, రావెళ్ల కాశమ్మ, ఫకీరు మోహన్ రెడ్డి, దాసోజు యాదగిరిచారి పాల్గొన్నారు.

యాదగిరీశుడికి లక్ష పుష్పార్చన



ఉత్సవ మూర్తులకు పుష్పార్చన చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శుక్రవారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను వివిధ పుష్ప మాలికలు, పట్టువస్త్రాలు, బంగారు, వైజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఈ వేడకలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువ జామున సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులను నిజాభిషేకం, తుల సీదళ అర్చనతో కొలిచారు. అనంతరం సుదర్శన హోమం, గజవాహన సేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం తదితర పూజలు నిర్వహించారు.



అడవిదేవులపల్లి మండల కేంద్రంలో వైభవంగా సాగుతున్న ప్రభబండ్ల ఊరేగింపు

ప్రభబండ్ల ప్రదర్శన

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని మహిషాసురమర్ధిని అమ్మవారి జాతరలో భాగంగా శుక్రవారం రాత్రి విద్యుత్ దీపాలంకరణతో ప్రభబండ్ల ప్రదర్శనను అంగరంగ నిర్వహించారు. ఈ ఊరేగింపునకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ముందుగా సుప్రభాత సేవ, అమ్మవారికి కుంకుమ అర్చనలు వంటి కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు వెల్లటూరి రామ్మోహన్ శర్మ వేదమంత్రోత్సవాలతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ మహోత్సవంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాచర్ల మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, నాయకులు కొత్త మద్రెడ్డి, మట్టారెడ్డి, శౌరెడ్డి, అంజిరెడ్డి, పచ్చిపాల లింగయ్య, బండి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆ దరఖాస్తులకు విలువేదీ!

ప్రజాపాలనలో రేషన్‌కార్డు దరఖాస్తులను పట్టించుకోని ప్రభుత్వం

- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరు
- పెండింగ్‌లో 71,563 ప్రజాపాలన దరఖాస్తులు
- అధికారులను అడిగితే మీసేవ కేంద్రాల్లో చేసుకోవాలంటూ సలహా



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : రేషన్‌కార్డు కోసం ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తులకు విలువ లేకుండా పోతోంది. కేవలం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారికే ప్రభుత్వం ఇటీవల కార్డులు మంజూరు చేసింది. ఇదేమని దరఖాస్తు దారులు అధికారులను అడిగితే.. దరఖాస్తులపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని పేర్కొంటున్నారు. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు. దీంతో ప్రజాపాలనలో రేషన్‌కార్డు కోసం చేసుకున్న 71,563 దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆ దరఖాస్తుదారుల్లో కొంతమంది మీ సేవ కేంద్రాల్లోనూ దరఖాస్తు చేసుకొని ఉండడంతో 9,650 మందికి మార్చి నెలలో కార్డులను మంజూరు చేశారు.

2024లో ప్రజాపాలన కార్యక్రమం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరిలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించింది. అందులో ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు దరఖాస్తులు స్వీకరించింది. చాలామంది ఇళ్లు, రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, గ్యాస్, తదితర పథకాల కోసం దరఖాస్తు చేసుకోగా, రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారే 71,563 మంది ఉన్నారు. మరోవైపు ఈ ఏడాది నిర్వహించిన సమగ్ర కుటుంబ ఆర్థిక, రాజకీయ, కులగణన సమయంలోనూ రేషన్‌కార్డు లేని వివరాలు సైతం స్వీకరించారు. కానీ ఇప్పటి వరకు వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మరోవైపు పిల్లల పేర్లు కార్డులో నమోదు కోసం చేసుకున్న దరఖాస్తులు కూడా అలాగే ఉండిపోయాయి.

ప్రజాపాలనలో రేషన్‌కార్డు కోసం వచ్చిన దరఖాస్తులు

మండలం	దరఖాస్తులు	మండలం	దరఖాస్తులు	మండలం	దరఖాస్తులు
అడవిదేవులపల్లి	662	కనగల్	2,599	నార్కట్‌పల్లి	4,106
అనుముల	2,148	కట్టంగూర్	3,901	నేరెడుగొమ్ము	0
చందంపేట	2,302	కేతేపల్లి	2,630	నిడమనూరు	3,903
చండూరు	1616	కొండమల్లేపల్లి	1,379	పెద్దఅడిశర్లపల్లి	2,757
చింతపల్లి	1,731	మాడుగులపల్లి	3,255	పెద్దవూర	2,570
చిట్యాల	2,752	మర్రిగూడ	1,739	శాలిగౌరారం	1,259
దామరచర్ల	4,036	మిర్యాలగూడ	353	తిప్పర్తి	2,683
దేవరకొండ	1,732	మునుగోడు	2,021	తిరుమలగిరిసాగర్	3,239
గుండ్లపల్లి	2,056	నకిరేకల్	795	త్రిపురారం	2,775
గుర్రంపోడు	3,230	నల్లగొండ	2,634	వేములపల్లి	1,888
		నాంపల్లి	2,813	మొత్తం	71,563

పేదలకు తప్పని ఎదురుచూపు

రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాన్ని పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టింది. ఆ సమయంలో కొత్త రేషన్ కార్డుదారులకు కూడా సన్న బియ్యం ఇస్తామని ప్రకటించింది. అయితే ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తులను, కులగణన సర్వేలో రేషన్‌కార్డు కావాలని చెప్పిన వినతులను పక్కన పడేసింది. కేవలం మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే రేషన్ కార్డులను మంజూరు చేసింది. అయితే ప్రజాపాలనలో చేసుకున్న 71,563 దరఖాస్తుదారుల విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కనీసం వాటి పరిశీలన కూడా చేయలేదు.

తామేం చేయలేమంటున్న అధికారులు

ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల విషయంలో అధికారులు తామేం చేయలేమని చెబుతున్నారు. ఆ దరఖాస్తులకు సంబంధించి ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు లేవని, వాటిని పరిశీలించి అర్హులకు మంజూరు చేయాలన్న విషయాన్ని కూడా తమకు చెప్పలేదని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అటు ప్రజాపాలనలో, ఇటు కులగణన సర్వే సమయంలో రేషన్ కార్డులు కావాలని విన్నవించుకున్నా ఫలితం లేకుండాపోయింది. అధికారులు మాత్రం రేషన్‌కార్డు కావాలంటే మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి మంజూరు చేస్తామంటూ ఉచిత సలహా ఇస్తున్నారు. దీంతో గత్యంతరం లేక ప్రజలు మళ్లీ మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

మరో 10,311 ఇందిరమ్మ ఇళ్లు



కనగల్ మండలం తేలకంటివారిగూడెంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు

- రెండో విడత మంజూరు చేసిన ప్రభుత్వం
- మొదటి విడతలో 1,753 ఇళ్లు.. వివిధ దశల్లో వాటి నిర్మాణాలు

నల్లగొండ : జిల్లాకు రెండో విడతలో 10,311 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఇప్పటికే మొదటి విడతలో 1,753 ఇళ్లను మంజూరు చేసింది. వాటి నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ఇక, రెండు విడతల్లో కలుకుని ఇప్పటివరకు మొత్తం 12,064 ఇళ్లు మంజూరయ్యాయి.

సిద్ధమవుతున్న అర్హుల జాబితా

జిల్లాలోని నియోజకవర్గాల్లో మొత్తం 17,500 ఇళ్లు నిర్మించాల్సి ఉంది. అయితే ఇప్పటికే రెండు విడతల్లో కలుపుకుని 12,064 ఇళ్లు మంజూరు కాగా.. మిగిలిన ఇళ్లకు సంబంధించి కూడా గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు లిస్టు తయారు చేస్తున్నాయి. వాటన్నింటిని మండల స్థాయిలో గెజిటెడ్ అధికారులు పరిశీలిస్తారు. ఆ తర్వాత జిల్లా ఇన్‌చార్జి మంత్రి అప్రూవల్‌తో కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులకు అందించనున్నారు.

గ్రామాల్లో పూర్తయిన సర్వే..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఇప్పటికే ప్రభుత్వం గ్రామాల్లో సర్వే నిర్వహించింది. ఎల్–1 (ఇంటి స్థలం ఉండి ఇల్లులేని వారు), ఎల్–2 (ఇంటి స్థలం, ఇల్లు లేనివారు), ఎల్–3 (పక్కా ఇల్లు ఉన్నవారు) ఇలా మూడు జాబితాలను తయారు చేసింది. మొదటగా ఎల్–1 జాబితాలో ఉన్నవారికి ఇళ్లను కేటాయిస్తోంది. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసిన ప్రభుత్వం మొదటి విడతలో ఆయా గ్రామాలకు 1,753 ఇళ్లను మంజూరు చేసింది. అందులో 591 ఇళ్ల నిర్మాణానికి మార్క్ చేయగా.. 238 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో, 3 ఇళ్లు రూఫ్‌లెవెల్‌లో ఉన్నాయి. కొన్ని ఇళ్లకు బేస్‌మెంట్ బిల్లు కూడా చెల్లించింది.

నిర్మాణంలో నిబంధనలు పాటించాలి



ఇందిరమ్మ ఇళ్లు నిబంధనల ప్రకారం నిర్మించాలి. ఇప్పటికే రెండో విడతల్లో 12,064 ఇళ్లు మంజూరయ్యాయి. మొదటి విడత ఇళ్ల నిర్మాణం వివిద దశల్లో ఉంది. కొన్ని ఇళ్లకు పేమెంట్లు కూడా చేశాం. మిగిలిన ఇళ్లను ఇందిరమ్మ కమిటీల సిఫారసు మేరకు పరిశీలించి అర్హుల జాబితా తయారు చేస్తాం. ఇల్లు మంజూరైన లబ్ధిదారులు నిబంధనల ప్రకారం నిర్మించి ప్రభుత్వం నుంచి డబ్బులు పొందాలి.

– రాజ్‌కుమార్, హౌసింగ్ పీడీ

గర్భిణులకు అవగాహన కల్పించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పక్కన ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, డీఎంహెచ్‌ఓ

నల్లగొండ : అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, సిబ్బంది సమన్వయంతో గర్భిణులను తీసుకోవాలిన జాగ్రత్తలు, వైద్య పరీక్షలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో మాతృ మరణాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. మాతా శిశు మరణాలను నివారించేందుకు వైద్య ఆరోగ్యశాఖకు.. ఐసీడీఎస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖలు సహకరించాలని సూచించారు. ఆరోగ్య సమస్యపై పీహెచ్‌సీకి వస్తే.. అక్క సాధ్యం కాకపోతే ఏరియా ఆసుపత్రులకు రిఫర్ చేయాలన్నారు. ప్రభుత్వ వైద్యులు రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్, డాక్టర్ మాతృనాయక్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

శిరీష ఆస్పత్రిపై విచారణకు ఆదేశం..

గతేడాది డిసెంబర్‌లో మిర్యాలగూడలోని శిరీష ఆసుపత్రికి కాన్పు కోసం వచ్చిన అడావత్ రాజేశ్వరికి రాజేశ్వరి వెళ్లగా, అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ శిరీష చివరి క్షణం వరకు రాజేశ్వరిని ఆసుపత్రిలో ఉంచుకొని.. పరిస్థితి విషమించాక నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి పంపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రసవానంతరం డిసెంబర్ 28న ఆమె మృతి చెందింది. రాజేశ్వరిని సకాలంలో ప్రభుత్వ ఆస్పత్రికి పంపడంలో నిర్లక్ష్యం వహించిన శిరీష ఆసుపత్రిపై మెజిస్టీరియల్, శాఖా పరమైన విచారణకు ఆదేశిస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్ : ప్రత్యామ్నయ పంటల సాగు, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. వరి, పత్తి వంటి సంప్రదాయ పంటలే కాకుండా కూరగాయలు, పండ్ల తోటలు, వాణిజ్య పంటలు, ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతులకు అవగాహ కల్పించాలని సూచించారు. రానున్న వానాకాలం సాగు సంసిద్ధంపై శుక్రవారం కలెక్టరేట్‌లో శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, వ్యవసాయాధికారులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులు పండించే వరి, పత్తి వంటి పంటల వల్ల శ్రమ ఎక్కువ, ఆదాయం తక్కువగా ఉంటోందని చెప్పారు. వీటిని దృష్టిలో ఉంచుకుని రైతులను ప్రత్యామ్నయ పంటల వైపు మళ్లించాలని కంది, కూరగాయలు, పండ్ల తోటలు అధిక ఆదాయం వచ్చే వాణిజ్య పంటల వైపు వారిని మళ్లించాలన్నారు. ఉద్యాన పంటలు, నూతన వంగడాల సాగుకు సంబంధించి ప్రతి రెండు మండలాలను కలిపి ఒక క్లస్టర్ ఏర్పాటు చేసి మార్కెటింగ్‌కు ప్రోత్సాహం కల్పించేలా ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. ఉద్యాన పంటల సాగు ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీ, డ్రిప్ సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, పద్మారెడ్డి, అంజిరెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీనివాస్, సత్తిరెడ్డి, శ్రీనివాస్‌రావు, గోపాల్‌రెడ్డి, జగన్, రాంరెడ్డి, వీరయ్య, ఎల్లయ్య, డీఏఓ శ్రవణ్‌కుమార్, ఉద్యాన అధికారి అనంతరెడ్డి పాల్గొన్నారు.

జీపీఓల స్క్రీనింగ్ టెస్ట్‌కు ఏర్పాట్లు పూర్తి

నల్లగొండ : గ్రామ పాలనాధికారుల (జీపీఓ) స్క్రీనింగ్ టెస్ట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న నల్లగొండలోని నాగార్జున డిగ్రీ కళాశాలలో నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్‌కు మొత్తం 276 మంది హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణకు ఇన్‌చార్జిగా అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ వ్యవహరిస్తారని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 9 గంటలకు కేంద్రానికి చేరుకోవాలని, 10 గంటల తరువాత వస్తే అనుమతించరని పేర్కొన్నారు. హాల్‌టికెట్‌తో పాటు ఒరిజినల్ గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని, ఒక పాస్ పోర్ట్ సైజు ఫొటో హాల్‌టికెట్‌పై అంటించి, మరో ఫొటో నామినల్ రోల్ కోసం తీసుకురావాలని సూచించారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న ఆపరేషన్ కగార్‌ను కేంద్రం వెంటనే ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో ప్రభుత్వం నరమేధం సాగిస్తోందన్నారు. కగార్ ఆపరేషన్‌ను వెంటనే ఆపి అక్కడ ఉన్న బలగాలను వెనక్కి పిలిపించాలన్నారు. ఆదివాసీల కోసం పోరాటం చేస్తున్న వారిని ప్రభుత్వం దుర్మార్గంగా చంపడం హేయమైన చర్య అన్నారు. అడవిలో ఉన్నవారు ప్రజల కోసం పోరాడుతున్నారే తప్ప వ్యక్తిగతంగా హింస చేయడం లేదన్నారు. అడవిలో ఉన్న సహజ వనరులు, ఖనిజ సంపదను కాజేసి బడా కంపెనీలకు అప్పజెప్పడం కోసం ప్రభుత్వం ఈ చర్యలకు దిగిందన్నారు. ఆపరేషన్ కగార్‌పై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, వినోద్‌నాయక్, తిరుపతి రామ్మూర్తి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

వన మహోత్సవానికి సన్నద్ధం



మండలాల వారీగా లక్ష్యం ఇలా..

మండలం	మొక్కలు	మండలం	మొక్కలు	మండలం	మొక్కలు
		గుర్రంపోడ్	1,39,794	నాంపల్లి	1,28,473
		కనగల్	1,34,416	నార్కట్‌పల్లి	1,64,291
అడవిదేవులపల్లి	55,714	కట్టంగూర్	1,51,264	నేరేడుగొమ్ము	69,965
అనుముల	79,778	కేతేపల్లి	1,21,232	నిడమనూరు	1,41,629
చందంపేట	1,05,915	కొండమల్లేపల్లి	1,04,255	పీఏ పల్లి	1,53,265
చండూరు	1,20,960	మాడ్గులపల్లి	1,17,856	పెద్దవూర	1,25,938
చింతపల్లి	1,45,537	మర్రిగూడ	1,19,407	శాలిగౌరారం	1,52,052
చిట్యాల	1,31,183	మిర్యాలగూడ	2,13,248	తిప్పర్తి	1,03,014
దామరచర్ల	1,60,521	మునుగోడు	1,46,891	త్రిపురారం	1,40,411
దేవరకొండ	1,20,724	నకిరేకల్	1,02,171	టి.సాగర్	1,24,978
గుండ్లపల్లి	1,49,807	నల్లగొండ	1,42,727	వేములపల్లి	84,280

జిల్లా వ్యాప్తంగా 39.51 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

- 844 నర్సరీల్లో మొక్కల పెంపకం
- మండలాల వారీగా లక్ష్యాల నిర్దేశం

దేవరకొండ: జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఇందుకుగాను ఆయా మండలాలతోపాటు శాఖల వారీగా లక్ష్యాలను జిల్లా అధికారులు నిర్దేశించారు. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన వన నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేశారు. ఈ ఏడాది జిల్లాలో దాదాపు 39,51,700 మొక్కలు నాటాలని అధికార యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకుగాను జిల్లా వ్యాప్తంగా 844 నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మొక్కలు నాటేందుకు సంబంధిత అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. వివిధ రకాల పండ్ల మొక్కలతోపాటు పలు రకాల పూల మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు.

ప్రణాళికలు సిద్ధం

వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు జిల్లా యంత్రాంగం పక్కా ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రస్తుత వేసవిని దృష్టిలో ఉంచుకుని ఆయా గ్రామపంచాయతీల్లో గల నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ఎండ వేడిమి నుంచి సంరక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నర్సరీలకు షేడ్ నెట్స్ ఏర్పాటు చేయడంతోపాటు మొక్కలకు ప్రతిరోజూ నీటిని అందిస్తున్నారు. ఈ ఏడాది అన్ని నర్సరీలు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి జిల్లాలోని ఆయా నర్సరీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు తగు సూచనలు ఇస్తున్నారు. విద్యాసంస్థలు, ఖాళీ స్థలాలు, వసతి గృహాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షిస్తాం



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న వన మహోత్సవంలో నాటిన ప్రతి మొక్కను సమష్టిగా సంరక్షిస్తాం. జిల్లా వ్యాప్తంగా వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించాం. అన్ని గ్రామపంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టాం. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో వన మహోత్సవ లక్ష్య సాధనకు కృషి చేస్తాం.

– శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఓ, నల్లగొండ

క్లుప్తంగా

గ్రూప్-2 ఉద్యోగానికి మల్లాపురం వాసి ఎంపిక


హరిబాబు

పెద్దఅడిశర్లపల్లి : పెద్దఅడిశర్లపల్లి మండలం మల్లాపురం గ్రామానికి చెందిన నారాయణదాసు హరిబాబు గ్రూప్- 2 ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఉస్మానియా క్యాంపస్‌లో ఎల్‌ఎల్‌బీ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఈయన గ్రూప్ - 2 పరీక్ష రాసి 606 ర్యాంక్ సాధించాడు. దీంతో మండలవాసులు హరిబాబుకు అభినందనలు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

గుండాల : ఎదురుదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు గాయాలపాలైన సంఘటన గుండాల మండలంలోని సుద్దాల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాల గ్రామానికి చెందిన అల్తాఫ్ సుద్దాల గ్రామం వైపు బైక్‌పై వెళ్తుండగా.. సుద్దాల గ్రామానికి చెందిన గూడ వెంకటేష్ వ్యవసాయ బావి నుంచి వస్తూ సబ్ స్టేషన్ ఆవరణలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఇద్దరిని 108 వాహనంలో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

ఎడ్లబండిని ఢీకొని యువకుడు మృతి


నర్సింహ (ఫైల్)

మునుగోడు: ఎద్దులబండిని ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం మునుగోడులో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మునుగోడు పట్టణానికి చెందిన పందుల నర్సింహ(26) ఇళ్లకు పెయింటింగ్ వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం చీకటిమామిడి గ్రామానికి తన బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ఎడ్ల బండిని బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని నల్లగొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి తల్లి ధనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

నాడు సాగు భూమి.. నేడు ఆధ్యాత్మిక వాడ

యాదగిరిగుట్ట: ఒకప్పుడు పచ్చని పంటలతో కనిపించే ప్రాంతమంతా నేడు ఆధ్యాత్మిక వాడగా రూపుదిద్దుకుంది. యాదగిరి కొండకు దిగువన 2016కంటే ముందు పంట పొలాలతో ఉండేది. ఇప్పుడు యాదగిరి క్షేత్ర అభివృద్ధిలో భాగంగా భక్తుల కోసం ఆధ్యాత్మిక భవనాలు నిర్మించారు. ప్రస్తుతం కొండకు దిగువన ఉత్తర దిశలో శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, లక్ష్మీ పుష్కరిణి, దీక్షా పరుల మండపం, కల్యాణ కట్ట, ఆర్టీసీ బస్టాండ్, సెంట్రల్ పార్కింగ్, ప్రెసిడెన్షియల్ సూట్ నిర్మాణాలు చేశారు. చెట్లను, గుట్టలను, పొలాలను తొలగించి పెద్ద రోడ్లు వేసి ఆకుపచ్చని అందం సంతరించుకునేలా మొక్కలు నాటారు. ఒకప్పుడు పచ్చని పొలాలు, చెట్లతో ఉన్న ఆ ప్రాంతమంతా ఇప్పుడు ఆధ్యాత్మిక వాడగా రూపుదిద్దుకుంది.


2016కు ముందు యాదగిరి కొండకు దిగువన ఉత్తర దిశలో ఉన్న పంట పొలాలు, పచ్చని చెట్లు


యాదగిరి క్షేత్ర అభివృద్ధిలో భాగంగా భక్తుల కోసం నిర్మించిన ఆధ్యాత్మిక కట్టడాలు

చైన్‌స్నాచింగ్ కేసులో ముగ్గురు అరెస్ట్

- నిందితుల నుంచి 5గ్రాముల బంగారం, బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- నల్లగొండ జైలుకు ఇద్దరు, సైదాబాద్ జువైనల్ హోంకు ఒకరి తరలింపు
- వివరాలు వెల్లడించిన చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రామంలో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ముగ్గురిని శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్ ప్రాంతంలో సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేసి చౌటుప్పల్ పోలీసులకు అప్పగించారు. వారి నుంచి 5గ్రాముల బంగారం, మూడు సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని శ్రీనివాస నగర్‌కు చెందిన ఎటికల ఫణిచందు(18), కోదాడ పట్టణం పెరిక హాస్టల్ ప్రాంతానికి చెందిన బాలుడు (17), మేడ్చల్ మల్కాజిగిరి పట్టణంలోని యాదవ్ నగర్‌కు చెందిన గుదాల తిరుమల్ (19) గతంలో వేర్వేరుగా కోదాడ, సూర్యాపేట, మేడ్చల్ ప్రాంతాల్లో చిన్నచిన్న దొంగతనాలకు పాల్పడుతుండేవారు. గతంలో పోలీసులు కేసు నమోదు చేసి మైనర్లు కావడంతో సైదాబాద్‌లోని జువైనల్ హోంకు తరలించారు. అందులో వీరి ముగ్గురి మధ్య స్నేహం ఏర్పడింది. బయటకు వచ్చి, ఎవరి ప్రాంతంలో వారు నివసిస్తుండగా ఇన్‌స్టాగామ్‌లో కలుసుకుని ఫోన్ నంబర్లు తీసుకుని ప్రతిరోజు ఫోన్‌లో మాట్లాడుకునే వారు. జల్సాలకు అలవాటు పడి ఎలాగైనా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఇలా ముగ్గురు కలిసి దొంగతనాలకు ప్లాన్ చేసుకున్నారు. ఈక్రమంలో మేడ్చల్‌లో ఉన్న తిరుమల్‌తోపాటు, కోదాడలో ఉన్న ఫణిచందు, మైనర్ బాలుడు బైక్‌పై ఈ నెల 21న చౌటుప్పల్‌కు చేరుకున్నారు. ముగ్గురు కలిసి బైక్‌పై హైదరాబాద్ వైపు బయలుదేరి వెళ్తుండగా మధ్యలో ఉన్న ఖైతాపురం గ్రామంలో ఒంటరిగా వెళ్తున్న వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గొలుసును చోరీ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని హైవేపై సీసీ కెమెరాలను పరిశీలించారు. నిందితులు హైదరాబాద్ వైపు వెళ్తున్నట్లు గుర్తించారు. సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని పోలీసులు పట్టుకుని విచారించగా వారు చోరీ చేసినట్లు అంగీకరించారు. సీసీఎస్ పోలీసులు నిందితులను చౌటుప్పల్ పోలీసులకు అప్పగించారు. ఈమేరకు చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి వారి నుంచి 5గ్రాముల బంగారం, మూడు సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఫణిచందు, తిరుమల్‌ను నల్లగొండ జైలుకు, మరో వ్యక్తి మైనర్ కావడంతో సైదాబాద్‌లోని జువైనల్ హోంకు తరలించినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

రాజకీయ కక్షతోనే కేసీఆర్‌కు నోటీసులు

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి: ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకోవడం చూసి కాంగ్రెస్ ప్రభుత్వం ఓర్వలేకపోతోందని, రాజకీయ కక్షతోనే నోటీసులు ఇచ్చిందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. శుక్రవారం నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కు వచ్చిన మిస్ వరల్డ్ పోటీదారులు రాష్ట్రంలో కేసీఆర్ చేసిన అభివృద్ధిని గుర్తు చేశారని తెలిపారు. తెలంగాణ దివాలా తీసి వేలకోట్ల రూపాయలు కొల్లగొట్టడం వల్లే ఈడీ కేసులో రేవంత్‌రెడ్డి అడ్డంగా ఇరుక్కుపోయారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రోజురోజుకు కుమ్ములాటలు బయటికి వస్తున్నాయన్నారు. 30 శాతం పర్సంటేజీ ఇవ్వనిదే సొంత ప్రభుత్వంలో పనులు కావడం లేదని సాక్షాత్తు కాంగ్రెస్ ఎమ్మెల్యే బట్టబయలు చేశారన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేక పరిపాలన వైఫల్యాన్ని కప్పి పుచ్చుకునేందుకు రేవంత్‌రెడ్డి కాళేశ్వరం కమిషన్ నోటీసు కుట్రలకు తెరలేపుతున్నారని దుయ్యబట్టారు. ధాన్యం కొనుగోళ్లు ఇప్పటి వరకు 40 శాతం కూడా జరగలేదని, కేంద్రాల వద్ద కుప్పలు వానకు తడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, యానాల అశోక్‌రెడ్డి, కొండూరు శంకర్, తరాల బలరాం, జ్యోతి బలరాం, కోటిరెడ్డి, సుధీర్, సతీష్, దుబ్బ మధు, సత్తిరెడ్డి, ప్రకాష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ వాహనం బోల్తా

నాంపల్లి: మండలంలోని రాయినికుంటతండా సమీపంలో పోలీస్ వాహనం టైర్ పేలడంతో అదుపు తప్పి బోల్తా పడింది. శుక్రవారం నాంపల్లి నుంచి నేరళ్లపల్లికి వెళ్తుండగా రాయినికుంట తండా వద్ద రోడ్డుపై కంకర ఉండడంతో వాహనం టైరు పగిలి పక్కనే ఉన్న రాళ్లకు ఢీకొని బోల్తాపడింది. అందులో ఉన్న ఇద్దరు పోలీసులకు స్వల్ప గాయాలు కాగా వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు.


రాయిణికుంట తండాలో అదుపుతప్పి బోల్తాపడిన పోలీస్ వాహనం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


బుచ్చిరెడ్డి(ఫైల్)

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండల పరిధిలోని అల్లాపురం గ్రామానికి చెందిన గూడూరు బుచ్చిరెడ్డి (59), పక్కీరు అల్వాల్‌రెడ్డి పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో తాళ్లసింగారం క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న తమ గ్రామస్తుడి వివాహానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈక్రమంలో బాలాజీ దేవాలయం దాటిన తర్వాత వలిగొండ వైపు వెళ్తున్న పెట్రోల్ ట్యాంకర్ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న అల్వాల్‌రెడ్డి, వెనుక కూర్చున్న బుచ్చిరెడ్డి ఎగిరి రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో ట్యాంకర్ బుచ్చిరెడ్డి పైనుంచి వెళ్లడంతో శరీర భాగాలు ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. అల్వాల్‌రెడ్డికి గాయాలుకాగా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

అదుపుతప్పి కారు బోల్తా

- ఒకరు మృతి.. ఏడుగురికి తీవ్రగాయాలు
- దైవ దర్శనానికి వచ్చి తిరిగి వెళ్తుండగా ఘటన


గాయపడిన రామస్వామి


ధ్వంసమైన కారు

బీబీనగర్: దైవ దర్శనానికి వచ్చి తిరిగి వెళ్తుండగా కారు అదుపు తప్పి బోల్తా కొట్టడడంతో ఒకరు మృతి చెందగా.. ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం బీబీనగర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌కు చెందిన చేగూరి రామస్వామిగౌడ్(60), లక్ష్మి దంపతులు, వారి కోడళ్లు భూమిక, మనీష తోపాటు వీరి పిల్లలైన అక్షిత్, అక్షయ్, శ్రీయాంక, సహస్రలతో కలిసి గురువారం సాయంత్రం కారులో యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి దర్శనానికి వచ్చారు. శుక్రవారం ఉదయం స్వామివారి దర్శనం చేసుకొని తిరిగి మొయినాబాద్‌కు బయలుదేరారు. బీబీనగర్‌కు రాగానే జాతీయ రహదారిపై గల ఫ్లైఓవర్ సమీపంలో కారు అదుపు తప్పి సర్వీస్ రోడ్డుపైకి పల్టీ కొట్టింది. దీంతో కారు పూర్తిగా ధ్వంసం కాగా అందులో ఉన్న ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను బయటకు తీశారు. నేషనల్ హైవే అంబులెన్స్‌లో వారిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా రామస్వామి, లక్ష్మితోపాటు, మరొకరి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రామస్వామి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రమాదానికి గురైన కారులో నలుగురు ఐదేళ్లలోపు చిన్నారులే ఉన్నారు.

బైక్‌ను తుఫాన్ ఢీకొట్టడంతో ఒకరు మృతి

యాచారం: నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. నల్లగొండ జిల్లా చందంపేటకు చెందిన కృష్ణ(32) గురువారం అర్ధరాత్రి బైక్‌పై రంగారెడ్డి జిల్లా యాచారం నుంచి మాల్ వైపు వెళ్తున్నాడు. మార్గ మధ్యలో చింతపట్ల గేట్ వద్ద తుఫాన్ వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో కృష్ణకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

స్వర్ణగిరి క్షేత్రంలో తిరువీధి ఉత్సవసేవ


తిరువీధి ఉత్సవసేవ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

భువనగిరి: పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం సాయంత్రం తిరువీధి ఉత్సవసేవ వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన సేవ, సుదర్శన నరసింహ హవనం, నిత్య కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం సుమారు 3వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ, పద్మావతి అమ్మవారికి కుంకుమార్చన సేవ జరిపించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

భార్యతో గొడవపడి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసులు


ఆత్మహత్యకు యత్నించిన హరీష్

అర్వపల్లి: మండల పరిధిలోని అడివెంల గ్రామానికి చెందిన రాయపర్తి హరీష్ పది రోజుల కిందట తన భార్య మానికతో గొడవపడ్డాడు. ఆమె పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటానని పురుగుల మందు డబ్బాతో శుక్రవారం గ్రామ శివారులోని గుట్ట ఎక్కి తన బంధువులకు వీడియోకాల్ చేసి చెప్పాడు. దీంతో అతడి బంధువులు, గ్రామస్తులు గుట్ట వద్ద వెతకగా ఆచూకీ దొరకకపోవడంతో 100నంబర్‌కు డయల్ చేశారు. అర్వపల్లి ఎస్‌ఐ బాలకృష్ణ, పోలీస్ సిబ్బంది పసుపులేటి సైదులు, మణికుమార్‌లు గుట్ట వద్దకు వెళ్లి ఫోన్ లొకేషన్ ఆధారంగా వెతికి హరీష్‌ను పట్టుకున్నారు. అతడి వద్ద ఉన్న పురుగుల మందు డబ్బాను స్వాధీనం చేసుకుని బంధువులకు అప్పగించారు. హరీష్ ప్రాణాలు కాపాడిన పోలీసులకు బంధువులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై ఐదు గేదెలు మృతి

రామన్నపేట: విద్యుదాఘాతానికి గురై ఐదు పాడి గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన శుక్రవారం రామన్నపేట మండలంలోని శోభనాద్రిపురం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శోభనాద్రిపురం గ్రామానికి చెందిన జక్కిలి ఐలయ్యకు చెందిన మూడు పాడిగేదెలు, జక్కిలి పద్మ, పోలేపల్లి సత్తయ్యలకు చెందిన ఒక్కో గేదె గ్రామశివారులోని పెసరు అనంతరెడ్డికి చెందిన పొలంలో మేత మేస్తుండగా తెగిపడి ఉన్న విద్యుత్ తీగ వాటికి తగిలింది. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాయి. ఒక్కో గేదె విలువ రూ 1.50లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. సమాచారం అందుకున్న రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

విరుల సాగుతో సిరులు


రాజామణి సాగు చేస్తున్న మల్లె పూల తోట

- పూల తోట సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న మహిళా రైతు
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు
- మరో ఐదుగురికి ఉపాధి చూపుతున్న కూనూరు గ్రామానికి చెందిన రాజామణి

భువనగిరిటౌన్ : పూల సాగు చేస్తున్న మహిళా రైతుకు సిరులు కురుపిస్తోంది. ఆధ్యాత్మిక ప్రాంతం కావడంతో ఇటు మహిళా రైతుకు, అటు వ్యాపారులకూ లాభాల పంట పండుతోంది. భువనగిరి మండలంలోని కూనూరు గ్రామంలో మహిళా రైతు పాశం రాజామణి తనకున్న పది గుంటల విస్తీర్ణంలో పూల సాగు చేపట్టింది. సాధారణ పంటలతో పాటుగా పూల సాగుపై మక్కువ చూపింది. కనకాంబరం, మల్లె, బొండు మల్లె, జాజిమల్లె పూల తోట వేసింది. ప్రతిరోజు రూ.3వేల వరకూ వస్తాయని చెబుతోంది. తనతో పాటు మరో ఐదుగురికి ఉపాధి కల్పిస్తున్నట్లు పేర్కొంటుంది.

సొంత వ్యాపారం చేద్దామనుకున్న ప్రయత్నంలోనే పూల తోట సాగు

తన భర్త కూలీ పనికి పోవడం ఇష్టం లేకపోవడంతో పాశం రాజామణి సొంత వ్యాపారం పెట్టే ఆలోచనలో భాగంగా విజయవాడ నుంచి కేవలం 10 పూల మొక్కలు తెచ్చి పెట్టింది. వచ్చిన పూలు అమ్మగా కొంత ఆదాయం రావడంతో మరికొన్ని మొక్కలు తెప్పించి తమకున్న పది గుంటల భూమిలో నాటారు. ప్రస్తుతం 250 మొక్కలు వరకు సాగు చేస్తోంది. ఇందులో బొడ్డుమల్లె, సన్నజాజి, మరికొన్ని కనకాంబరాల మొక్కలు ఉన్నాయి. అంతే కాకుండా పూలదండలు అల్లుతున్న మహిళలకు కిలో రూ. 120నుంచి రూ.200ల వరకు ఇస్తుండడంతో వారికి ఉపాధి దొరుకుతోంది. చిరు వ్యాపారులు భువనగిరి, యాదగిరిగుట్టతో పాటు, వివిధ పెళ్లిల సీజన్‌లో అర్డర్లపై పంపిస్తోంది.

పూల సాగుతో అధిక లాభాలు



సీజన్‌లో పూల సాగుతో మంచి లాభాలు వస్తాయి. ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాం. ఈ సాగుతో వచ్చే ఆదాయంతో నా ముగ్గురు కుమారులను ఉన్నత చదువులు చదివించాను. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరో ఎకరంలో సైతం పూల తోట సాగు చేస్తా.

– పాశం రాజామణి, కూనూరు, భువనగిరి మండలం

ప్రేమించిన యువతికి వివాహమైందని..

- మనస్తాపంతో ఉరేసుకున్న యువకుడు


మధు (ఫైల్)

భువనగిరి: ప్రేమించిన యువతి వివాహమైందని మనస్తాపానికి గురైన యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన భువనగిరి మండలంలోని తుక్కాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాసాల అయిలయ్య, భాగ్యమ్మ కుమారుడు మధు(23) రోజుమాదిరిగా ఈ నెల 22న రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించాడు. తల్లి భాగ్యమ్మ ఉదయం లేచి ఇంట్లో గదులను శుభ్రం చేసేందుకు వెళ్లింది. ఈ క్రమంలో మధు నిద్రించే గది తలుపు తెరిచింది. కుమారుడు ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని కనిపించాడు. స్థానికులు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులకు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ప్రేమించిన యువతి వివాహం కావడం తోపాటు, అప్పులు ఎక్కువ అయ్యాయనే బాధతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు తెలిపారు.

పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత

మునగాల : మండల శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున కోదాడ నుంచి హైదరాబాద్‌కు ఓ వాహనంలో పశువులను తరలిస్తుండగా మండల పోలీసులు తనిఖీలు నిర్వహించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ నుంచి టీఎస్ 29 టీ 3458 నంబర్ గల అశోక్ లేలాండ్ వాహనంలో పది పశువులు (8ఆడ, రెండు మగ)ను హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తుండగా తనిఖీలు చేపట్టి వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కాగా కోదాడ పట్టణానికి చెందిన వేముల అనిల్, వాహనం డ్రైవర్ షేక్ అసీఫ్, క్లీనర్ సయ్యద్ బాబులపై కేసు నమోదు చేసి పట్టుబడిన పశువులను హైదరాబాద్‌లోని జియాగూడ గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.


వాహనంలో తరలిస్తున్న పశువులు